www.mediafocusnews.com

# మీడియా ఫోకస్

For People

దిన పత్రిక




సంపుటి: 05 సంచిక: 295 గురువారం 03 నవంబర్ 2022 ఎడిటర్ : డి.నాగరాజు పేజీలు: 4 వెల : 2/-

## 'విశాఖ రాజధాని' అవకాశాన్ని వినియోగించుకోకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతాం- స్పీకర్ తమ్మినేని

- ఆమదాలవలసలో రౌండ్ టేబుల్ సమావేశం
- హాజరైన అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం
- 'విశాఖ రాజధాని' ఉత్తరాంధ్రవాసుల కల అని వెల్లడి
- ఇప్పుడు అవకాశం వచ్చిందని స్పష్టీకరణ



**మీడియా ఫోకస్ న్యూస్ :** ఉత్తరాంధ్ర వెనుకబాటుకు చరిత్ర ఉందని, గతంలో పాదయాత్ర సందర్భంగా వైఎస్ జగన్ ఇక్కడి పేదరికాన్ని గుర్తించారని ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలసలో విశాఖ రాజధాని సాధన ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో తమ్మినేని కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమి కోసం, జీవించే హక్కు కోసం, భుక్తి కోసం గతంలో ఇక్కడ ప్రజలు ఎలుగెత్తారని వివరించారు. ఇప్పుడు విశాఖ రాజధాని ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధికి అవకాశం వచ్చిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతామని అన్నారు. అనవసర పట్టింపులకు పోకుండా ఉత్తరాంధ్రలోని అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని తమ్మినేని పిలుపునిచ్చారు. వికేంద్రీకరణకు మద్దతు ఇవ్వకపోతే నష్టపోయేది మనమేనని అన్నారు. ఒక్క రాజధాని వద్దని మూడు రాజధానులే ముద్దు అని వ్యాఖ్యానించారు. అమరావతి కోసం 30 వేల ఎకరాలు తీసుకోవడం రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమేనని తమ్మినేని ఈ సందర్భంగా ఆరోపించారు.

## ఒక మనిషి ఎంత తింటాడు? ఏపీ అధికారులు ఏం చెప్పారంటే ?



**మీడియా ఫోకస్ న్యూస్ :** ఇదేదో.. ఏపీ ప్రజల ఆహార వ్యవహారాల గురించిన చర్చకాదు. అసలు ఆ విషయాన్ని కూడా ప్రస్తావించలేదు. రాష్ట్రంలో కొన్ని రోజులుగా ముఖ్యంగా గత వారం రోజులుగా జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి జగన్ ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.అదేసమయంలో తన పార్టీ నేతలపై వస్తున్న ఆరోపణలు కూడా సీఎం జగన్ను ఇబ్బంది పెడుతున్నాయని తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. విషయం ఏంటంటే.. కొన్నాళ్లుగా ఏపీలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సర్కారు అనుసంధానం పెంచుతోంది. ప్రభుత్వ సేవలకు నిర్దేశిత సొమ్ము తప్ప రూపాయి అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని కూడా చెబుతోంది.అయినా కూడా చాలా జిల్లాల నుంచి వస్తున్న స్పందన ఫిర్యాదుల్లో అవినీతిపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. రైతులకు ఇచ్చే పాస్ బుక్కుల నుంచి సాధారణ ప్రజలకు ఇచ్చే ఫ్యామిలీ సర్టిఫికెట్లు డెత్ సర్టిఫికెట్లు వంటివాటిలో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుంటోందని ప్రజల నుంచి డబ్బులు గుంజుతున్నారని స్పందనలో ఆధారాలతో సహా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.ఇక రాష్ట్రంలో గత వారంలో రెండు ఘటనలు ప్రభుత్వానికి మరింత బ్యాడ్ నేమ్ తెచ్చేలా చోటు చేసుకున్నాయి. ప్రముఖ ప్రభుత్వ వైద్య శాలల్లో పోస్టు మార్టమ్ తర్వాత బడీలను అప్పగించేందుకు లంచాలు తీసుకున్నారు.ఇవి కూడా ఆధారాలతో సహా కొందరు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఆయా విషయాలను తాజాగా సీఎం జగన్ వద్ద ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా జగన్ సంబంధిత అధికారులను నిలదీసినట్టు తెలుస్తోంది. ఈ సమయంలోనే ఆయన 'ఒక మనిషి ఎంత తింటాడు?" అని నర్మగర్భంగా లంచాలపై ప్రశ్నించినట్టు సమాచారం. అయితే దీనిపై అధికారులు మాత్రం ఆ అవసరంలేదని ఇప్పుడు పీఆర్సీ పెరిగిన తర్వాత బాగానే జీతాలు ఇస్తున్నామని ఎవరూ లంచాల జోలికి పోకుండా కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారట.అయినా. కూడా జగన్ సంతృప్తి వ్యక్తం చేయలేదు. ఈ క్రమంలోనే ఆయన అనూహ్యంగా తానే స్వయంగా ప్రజలతో మాట్లాడతానని ఈ కార్యక్రమాన్ని నేనే ప్రారంభిస్తానని చెప్పారట. ఈ నేపథ్యంలో 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు తన పార్టీ నాయకులు కూడా ప్రజల ఫిర్యాదులకు రేటు నిర్ణయిస్తున్నారని ముఖ్యంగా కాంట్రాక్టర్ల నుంచి కూడా వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో జగన్ వారి విషయాన్ని కలెక్టర్లకు అప్పగించినట్టు సమాచారం. మొత్తానికి రాష్ట్రంలో మార్పు రావాలని ఈ ఆరోపణలు సహించేది లేదని జగన్ స్పష్టం చేసినట్టు సమాచారం.

## ఏపీకి ఇంత ద్రోహమా..
## బీజేపీపై మరో దుమారం




**మీడియా ఫోకస్ న్యూస్ :** ఔను! ఇప్పుడు వెలుగు చూసిన వార్తలే కనుక నిజమని తేలితే ఏపీ ప్రజలు బీజేపీని అస్సలు క్షమించే అవకాశం లేదని అంటున్నారు పరిశీలకులు. పైగా బీజేపీ గ్రాఫ్ మరింత పడిపోయినా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు. ఇక బీజేపీ నాయకులు కూడా ప్రజలకు సమాధానం చెప్పలేరని అంటున్నా రు. మరి ఏం జరిగింది? ఎందుకు ఈ చర్చ తెరమీదికి వచ్చింది? అనేది ఆసక్తిగా మారింది. రాష్ట్ర విభజన చట్టంలోనే విశాఖకు రైల్వే జోన్ ఇస్తారని ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పోయి మోడీ కొలువుదీరిన తర్వాత ఏపీ విషయాలు విభజన అంశాలను ఆయన పక్కన పెట్టేశారు.ఇక అప్పటి నుంచి కూడా విశాఖ రైల్వే జోన్ విషయం ప్రస్తావనకు రావడం లేదు. ఇటీవల సీఎం జగన్ కేంద్ర మంత్రి అమిత్ షాను కోరడంతో మళ్లీ ఈ ప్రతిపాదన తెరమీదికి వచ్చింది. దీంతోతాజాగా ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 11న విశాఖకు వస్తున్న నేపథ్యంలో విశాఖ రైల్వే జోన్కు కూడా ఆయన శ్రీకారం చుడతారని రాజకీయంగా వార్తలు వస్తున్నాయి. దీనిపై అటు కేంద్రం కానీ ఇటు ఏపీ ప్రభుత్వం కానీ ఎలాంటి ప్రకటనా చేయలేదు. అయిన ప్పటికీ.. ఈ విషయం చర్చకు వస్తోంది. బహుశ ప్రధాని షెడ్యూల్లో ఇది ఉండే ఉంటుందని మేధావులు సైతం చెబుతున్నారు.ఇదిలావుంటే తాజాగా బీజేపీ ఏపీ వర్గాలు ఒక సమావేశం నిర్ణయించాయి. ఈ సమావేశంలో ప్రధాని మోడీ పర్యటనలోతాము ఏం చేయాలనే అంశంపై చర్చించాయి. ఈ క్రమంలో ప్రధాని మోడీ విశాఖ రైల్వే జోన్కు శంకు స్థాపన చేస్తారనే విషయంపైనా చర్చించారు.అయితే దీనిని స్వాగతించాల్సిన బీజేపీ నాయకులు అసలు ఈ కార్యక్రమాన్ని నిలిపివేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారని దీనిపై కేంద్ర బీజేపీకి లేఖ రాయాలని కూడా నిర్ణయించుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఇవే ఇప్పుడు ఆశ్చర్యంగాను విస్మయంగాను ఉన్నాయి. ఎందుకంటే జరగ్గ జరగ్గ ఒక మంచి కార్యక్రమం జరుగుతుంటే ఇలా ఎందుకు అడ్డుపడుతున్నారు? ఏపీ అభివృద్ధి వారికి ఇష్టం లేదా? అనే చర్చ తెరమీదికి వచ్చింది.అయితేబీజేపీ నాయకులు చెబుతున్నదేంటంటే.. తమ పార్టీ రాజ్యసభ సభ్యులు కేంద్రాన్ని నిలదీయడంతో ఈ ప్రాజెక్టుకు కదలిక వచ్చిందని ఇది రాజకీయంగా తమకు మాత్రమే లబ్ధి చేకూరాలని వచ్చే 2024 ఎన్నికల్లో ఎలాగూ తమ ప్రభుత్వం ఏపీలో అధికారంలోకి వస్తుందని(?) సో అప్పుడు ఈ కార్యక్రమం చేయించాలని భావిస్తున్నట్టు తేల్చి చెప్పారు. అంతేకాదు ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని తమకు అనుకూలంగా వైసీపీ మలుచుకుని రాజకీయంగా వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తోందని అందుకే తాము ఒప్పుకోవడం లేదని కుండబద్దలు కొట్టారు.అయితే ఇది సరికాదని మేధావులు అంటున్నారు. ప్రతి విషయాన్నీ రాజకీయంగా చూడడం ఓటు బ్యాంకుగా మార్చుకోవడం చేస్తే ఏపీ ఇలానే ఉండిపోతుందని వారు హెచ్చరిస్తున్నారు. మరి బీజేపీ నేతలు ఇలానే ముందుకు వెళ్తారో.. ఏపీ అభివృద్ధి కోరుకుంటారో చూడాలి.

## ఈ నెల 11న విశాఖకు వస్తున్న ప్రధాని మోదీ

- ప్రధాని పర్యటన షెడ్యూల్ ఖరారు
- మోదీకి స్వాగతం పలకనున్న గవర్నర్, సీఎం జగన్
- ఐఎన్ఎస్ చోళాలో బస చేయనున్న ప్రధాని
- ఈ నెల 12న పలు పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



**మీడియా ఫోకస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 11న విశాఖపట్నం వస్తున్నారు. ఈ నెల 12న విశాఖలో పలు పథకాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మోదీ విశాఖ రానుండడం ఇది మూడోసారి. తాజా పర్యటన సందర్భంగా, ప్రధానికి ఐఎన్ఎస్ డేగా వద్ద ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సీఎం జగన్ స్వాగతం పలకనున్నారు. అక్కడి నుంచి మోదీ తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి చేరుకుంటారు. రాత్రికి ఐఎన్ఎస్ చోళాలో బస చేస్తారు. మరుసటి రోజు ఆంధ్రా యూనివర్సిటీ మైదానానికి చేరుకుని అక్కడి సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా మోదీ దాదాపు 14 ప్రాజెక్టులకు వర్చువల్ గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ మేరకు మోదీ పర్యటన ఖరారైంది.

## రాజస్థాన్ కాంగ్రెస్ రచ్చ మళ్లీ మొదలు..!




**మీడియా ఫోకస్ న్యూస్ :** అధికారం చేతిలో ఉన్నప్పుడు కొన్ని పైత్యాలు వచ్చేస్తుంటాయి. అలాంటి వాటి విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న ట్రాక్ రికార్డు అంతా ఇంతా కాదు. కానీ.. అధికారం చేతి నుంచి చేజారిపోవటమే కాదు.. మళ్లీ ఎప్పటికి వస్తుందో కూడా అర్థం కాని పరిస్థితుల్లో ఉన్న వేళలోనూ.. దాన్ని దక్కించుకునే దాని కంటే కూడా.. డ్యామేజ్ చేసే పనుల మీద ఫోకస్ చేసే ధోరణి కాంగ్రెస్ నేతలకు ఎక్కువనే చెప్పాలి. ఒకరు తక్కువ.. మరొకరు ఎక్కువ అన్న తేడా లేకుండా పార్టీని తరచూ ఇబ్బంది పెట్టే బ్యాచ్ కాసింత ఎక్కువే.ఇవాల్టి రోజున కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్ని వేళ్ల మీద లెక్కించొచ్చు. అలాంటి రాష్ట్రాల్లో కాస్త చెప్పుకోదగిన రాష్ట్రం ఏదైనా ఉందంటే అది రాజస్థాన్ మాత్రమే. ఆ రాష్ట్రాన్ని అయినా సరిగా పాలించే దానిపై ఫోకస్ కంటే కూడా అధికారం ఎవరి చేతిలో ఉండాలన్న దానిపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ కు.. ఆయన ప్రత్యర్థి వర్గం సచిన్ పైలెట్ కు మధ్య నడుస్తున్న వార్ తరచూ పార్టీకి ఇబ్బందికరంగా మారుతూ ఉంటుంది. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు.. ఆ మధ్యన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడి పదవిని సీనియర్ అయిన అశోక్ గెహ్లాత్ కు కట్టబెట్టి.. జూనియర్ అయిన సచిన్ పైలెట్ ను రాజస్థాన్ ముఖ్యమంత్రిని చేద్దామని అధినాయకత్వం భావించింది.ఉనికి లేని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడి పదవి కంటే కూడా రాజస్థాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవే తనకు ముఖ్యమన్న రీతిలో వ్యవహరించిన అశోక్ గెహ్లాత్ తీరుతో గాంధీ ఫ్యామిలీ తన నిర్ణయాన్ని మార్చుకోవటం.. మల్లికార్జున ఖర్గేకు పగ్గాలు దక్కేలా చేయటం తెలిసిందే.ఇదిలా ఉంటే.. తాజాగా సచిన్ పైలెట్ మరోసారి గళం విప్పారు. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తూ తిరుగుబాటు చేసే వారిపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలంటూ సచిన్ పైలెట్ మరోసారి రచ్చ మొదలు పెట్టారు. పార్టీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మల్లికార్జున ఖర్గేను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాజస్థాన్ లోని పార్టీలో కొందరు నేతలు వ్యవహరించిన తీరును ప్రస్తావిస్తూ.. గీత దాటిన వారిపై చర్యలకు కొత్త అధ్యక్షుల వారు ద్రష్టి పెట్టాలని కోరారు.కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటు చేసిన వారిపై కొత్త అధ్యక్షుడు చర్యలు తీసుకోవాలని.. రాజస్థాన్ లో నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితికి ముగింపు పలకాలని కోరారు. తాజాగాజరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీ.. అశోక్ గెహ్లాత్ పై ప్రశంసలు కురిపించటం ఆసక్తికరంగా మారిందన్నారు. గతంలో గులాం నబీ అజాద్ ను కూడా పార్లమెంటులో మోడీ ఇలానే చేశారని.. ఆ తర్వాత ఏం జరిగిందన్న విషయాన్ని గుర్తు చేశారు. తాజా పరిణామాల్ని తేలిగ్గా తీసుకోకూడదన్న ఆయన.. గెహ్లాత్ మీద చర్యలకు ఉపక్రమించాలని కోరుతున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమంటే.. పార్టీ లైను దాటిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న సచిన్ పైలెట్.. ఈ విషయాన్ని పార్టీ అంతర్గత వేదికలో ప్రస్తావించే కన్నా.. బాహాటంగా చెప్పటం ద్వారా పార్టీ వ్యవహారాల్ని రచ్చగా మార్చటం తప్పించి మరింకేమీ చేస్తున్నది లేదు. క్రమశిక్షణ చర్యలు కోరుతున్న ఆయన.. తాను చేస్తుందన్నదేమిటి? అన్న ప్రశ్న ఆయన తీరును చూసినప్పుడు కలుగక మానదు. ఓపక్క పార్టీ కీలక నేత రాహుల్ గాంధీ.. పార్టీని పట్టాల మీదకు ఎక్కించేందుకు పాదయాత్ర చేస్తుంటే.. సచిన్ పైలెట్ లాంటి వాళ్లు తాము కోరుకున్న ఎజెండా కోసం పడుతున్న తీరును చూస్తే.. కాంగ్రెస్ కు అసలు సమస్య ఎక్కడన్నది ఇట్టే అర్థం కాక మానదు.

# కాంగ్రెస్ పార్టీ భారత్ జూడో యాత్ర మొదలుపెట్టిన రాహుల్ గాంధీ .



**(మీడియా ఫోకస్ న్యూస్ ):** రంగారెడ్డి జిల్లా,శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ నుండి ఆల్విన్ కాలనీ వరకు జరిపేటి జైపాల్ ,జరపేటి రామరాజుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర కొనసాగించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నలుమూలల నుండి వేల కార్యకర్తలు , ప్రజలు పాల్గొని యాత్రకు అడుగడుగునా నీరాజ వందనాలు పలుకుతూ స్వాగతించారు. డప్పు చప్పులతో మేళ తాళాలతో గిరిజన నృత్యాలతో గుస్సాడీ సందడితో , కళాకారుల పాటలతో రాహుల్ గాంధీని అలరించారు. ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురవుతుంటే నేనున్నానని భరోసా ఇవ్వడానికి విచ్చేసిన రాహుల్ గాంధీ కి అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరి సమస్యలు తెలుసుకుంటూ వాళ్లతో మమేకమవుతూ ముందుకు సాగారు. అడుగడుగునా కాంగ్రెస్ పార్టీ కటౌట్లు బ్యానర్లు జెండాలు ఏర్పాటు చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకురావడానికి వారు కృషి చేశారు .జరిపిటి జైపాల్ మాట్లాడుతూ , తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ చేస్తున్న అన్యాయాలు అరాచకాలను ఎదుర్కొని నిలవాలంటే కేవలం అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలియజేశారు. ప్రజలకు కూడు గుడ్డ , గూడు అనే నినాదం కాంగ్రెస్ పార్టీ తోనే మొదలైందని , కాబట్టి రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ ప్రతి పేదవాడి గుండే చప్పుడని , ప్రతి ఇంటికి ప్రతి గడపగడపకు కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్త , ప్రతి నాయకులు భుజాల పైన వేసుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటినుండి అధికార పార్టీ గానీ మిగతా ఏ పార్టీ అయినా సరే ప్రజలను ఇబ్బంది పెడితే ఖండిస్తూ ముందుకు సాగుతామని తెలియజేశారు.శేరిలింగంపల్లి డివిజన్ నాయకులు రేవల్ల రాజేష్ వారి సహచర బృందం తోపాటు కలిసి రాహుల్ గాంధీకి సంఘీభావంగా భారత్ జూడో యాత్రలో పాల్గొని.రానున్న రోజులలో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామరాజు , జావిద్ భాయ్ , పోషన్న , రాజేందర్ , సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# నడిగడ్డ తండావాసుల అరెస్టు అక్రమం .గజ్జల యోగానంద్.




**(మీడియా ఫోకస్ న్యూస్ ):** రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బిజెపి అసెంబ్లీ ఇంచార్జ్, గజ్జల యోగానంద్ నడిగడ్డ తండావాసుల అక్రమ అరెస్టును ఖండించారు. ఈ సందర్భంగా గజ్జల యోగానంద్ మాట్లాడుతూ , ఈ మధ్య కాలంలో కురిసిన భారీ వర్షాల కారణంగా నడిగడ్డ తండాలో చాలా ఇళ్లు కూలి పోవడం జరిగిందని , అందుకు చిన్నచిన్న మరమ్మత్తుల కోసం ఇసుక కొరకు ఒక చిన్న ఆటో ట్రాలీలో ఇసుక తీసుకురావడం జరిగిందని , వాటిని సీఆర్పీఎఫ్ వాళ్లు అడ్డుకోవడంతో తాండావాసులందరు కలిసి ఎందుకు అడ్డుకుంటున్నారని నిరసన తెలియ చేసినందుకు సీఆర్పీఎఫ్ వాళ్లు పోలీసులను పిలిపించి అక్రమంగా తండావాసులను అరెస్టు చేసి కేసు వేయడం జరిగిందని , ఇదంతా స్థానిక తెరాస కార్పొరేటర్ స్థానిక తెరాస ఎమ్మెల్యే కలిసి ఆడుతున్న నాటకమని అన్నారు. వారికి తప్పకుండా ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. వెంటనే నడిగడ్డ తాండవాసులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన తాండా వాసులు నడిగడ్డ తాండ గిరిజన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బిజెపి మియాపూర్ డివిజన్ ఉపాధ్యక్షులు నాయిని రత్నకుమార్, రంగారెడ్డి జిల్లా బిజెపి ఒబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు దేవునూరు చందు,బిజెపి మియాపూర్ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆంజనేయులు, బీజేవైఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కుమార్ సాగర్, క్రిష్ణానాయక్, మోహన్నాయక్, మహేష్, ఈశ్వర్, రమేష్, సంపత్, రవి నాయక్ లను వెంటనే విడుదల చేయాలని అన్నారు.

# దేవదాయ శాఖ మంత్రి ని ఆట బాలోత్సవానికి ఆహ్వానించిన ఆట బృందం.



**(మీడియా ఫోకస్ న్యూస్ ):** బెక్కంటి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం సౌజన్యంతో భద్రాచలం మరియు ఆట ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం రామాలయ మిథిలా స్టేడియంలో నవంబర్ 12 ,13, 14 తేదీలలో నిర్వహించే ఆట బాలోత్సవానికి రావాలని ట్రస్ట్ చైర్మన్ బెక్కంటి శ్రీనివాస్ రావు, ఆట రాష్ట్ర కార్యవర్గం బుధవారం నాడు హైదరాబాద్ మంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా ఆహ్వానించారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని సెప్టెంబర్ 4వ తేదీన ఖమ్మం జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు రోడ్ రవాణా శాఖ మంత్రివర్యులు పువ్వాడ పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగిందని బెక్కంటి తెలిపారు. ఈకార్యక్రమంలో ఆట జాతీయ అధ్యక్షులు బెక్కంటి శ్రీనివాస్ వెంట ఆట రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎన్ జనార్ధన్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కేవిఎస్ నాయుడు పాల్గొన్నారు.

# బిజెపి నాయకులపై టిఆర్ఎస్ దాడిని ఖండిస్తూ నిరసన.



**(మీడియా ఫోకస్ న్యూస్ ):** మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో బిజెపి నాయకులపై టిఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించిన దాడులు పట్ల బిజెపి శ్రేణులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఆర్ వి కాంప్లెక్స్ వద్ద సీఎం కేసీఆర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర దళిత మోర్చా ఉపాధ్యక్షులు పెరుమాలపల్లి విజయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలువేరు సాంబశివరావులు మాట్లాడుతూ, మునుగోడు ఉప ఎన్నికలలో టీఆర్ఎస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడడం తో పాటు బిజెపి అభ్యర్థిని ప్రచారాలు చేసుకోకుండా అడ్డుకున్నారని విమర్శించారు. చివరి రోజు ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి ఈటల రాజేందర్ కాన్వాయ్ పై బిజెపి కార్యకర్తలపై టిఆర్ఎస్ నాయకులు దాడులకు పాల్పడడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఈ సంఘటనపై ప్రభుత్వానికి ధైర్యం దమ్ముంటే పారదర్శకమైన విచారణ నిర్వహించి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమం లో బిజెపి మండల అధ్యక్షులు గుండా చంద్రశేఖర్ రెడ్డి,బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కె రాము, పట్టణ ప్రధాన కార్యదర్శి పగడాల నాగేంద్రబాబు,మండల ఉపాధ్యక్షులు పెరుమాళ్లపల్లి మోహనరావు, యువమోర్చ నాయకులు పెరుమాళ్లపల్లి శ్రీకాంత్, బెజ్జం శ్యామ్, కే మార్క్స్, రాము, వినయ్ రమేష్, రాజు ప్రసాదరావు, సంజీవరవు, ఆగస్టయిన్,బి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు మేం వ్యతిరేకం కాదు. బండి సంజయ్ .



**(మీడియా ఫోకస్ న్యూస్ ):** బీజేపీ రాష్ట్ర అద్యక్షుడు బండి సంజయ్ మాట్లాడుతూ,ఉద్యమంలో జెండాలు కలిశాయని , మనుషులు కలిశారని , కొంతమంది మనసులు కూడా కలిశాయని ,అందరి బండారం బయటపెడ్తామని , ఉద్యోగులకు మేం వ్యతిరేకం కాదని ,వాళ్లకు తెల్సు మా పద్ధతేంటో అని అన్నారు.

# దేశ సమైక్యత కోసమే భారత్ జోడో యాత్ర రాహుల్ గాంధీ.



**(మీడియా ఫోకస్ న్యూస్ ):** ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం అధ్యక్షులు రామ్మూర్తి నాయక్ ఆధ్వర్యంలో జోడో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులుభావి భారత ప్రధాని రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో యాత్రకు సింగరేణి మండలం నుండి 41 గ్రామపంచాయతీల నుంచి యాత్రకు బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు దేశాన్ని ఏకం చేయడానికి బావి భారత ప్రధాని శ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర తెలంగాణలో జరుగుతున్న సందర్భంలో తెలంగాణ సీఎల్పీ లీడర్,శాసనసభ్యులు మల్లు మట్టి విక్రమార్క పిలుపుమేరకు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ నాయకత్వంలో సింగరేణి మండలం కాంగ్రెస్ పార్టీ



మండల కోఆర్డినేటర్ షేక్ అప్సర్ ఆధ్వర్యంలో సింగరేణి మండలం నుండి కదం తొక్కిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బయలుదేరడం జరిగింది. భారత్ జోడి యాత్ర సింగరేణి మండలం నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ,అభిమానులు, నాయకులు భారీ సంఖ్యలో బయలుదేరి రాహుల్ గాంధీ జోడో యాత్రలో పాల్గొని రాబోయే రోజులలో దేశమంతా కాంగ్రెస్ జెండా రెపరెపలాడడం ఖాయమని రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని దేశ ప్రజలు రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా గెలిపించడం ఖాయమని, రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలని ప్రజల ఆక్షిస్తున్నారని వారు తెలిపారు, తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్ పార్టీనీ టిఆర్ఎస్ పార్టీని విలీనం చేస్తానని ఆ రోజులలో చెప్పడం జరిగింది. కెసిఆర్ దొంగ మాటలు చెప్పి తెలంగాణ ప్రజలను మోసపూరిత వాగ్దానాలు చేసి తెలంగాణలో ప్రజలను మభ్య మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కెసిఆర్ కు రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్తారని, రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వారు తెలిపారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, చంద్ర ప్రకాష్, వీర ప్రతాప్, ఓం, ప్రకాష్, భీముడు, రాందాస్, తదితరులు పాల్గొని యాత్రను విజయవంతం చేయుటకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో బయలుదేరి రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేస్తూ బయలుదేరడం జరిగింది.

# జూలూరుపాడు మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే రాముల నాయక్.



**(మీడియా ఫోకస్ న్యూస్ ):** వైరా నియోజకవర్గం జూలూరుపాడు మండలంలో ఎమ్మెల్యే రాములు నాయక్ మండలంలో విస్తృతంగా పర్యటించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన పేద ప్రజలందరికీ లబ్ధి చేకూర్చేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు గొప్ప నాయకుడు అని వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రం ప్రవేశపెట్టిన నూతన పథకాలలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం జూలూరుపాడు మండలం సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఫంక్షన్ హాల్లో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చౌడం నరసింహారావు అధ్యక్షతన జరిగింది. జూలూరుపాడు మండలాలలో అభివృద్ధి మరింత వేగవంతం చేసినందుకు జూలూరుపాడు మండల ప్రజలు ఎమ్మెల్యే రాములు నాయక్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే రాములు నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందినది అని దేశంలో ఏ రాష్ట్రం అభివృద్ధి చెందని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పదంలో నడిపించిన ఒకే వ్యక్తి సీఎం కేసీఆర్ అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం లో అన్ని కులాల వారికి లబ్ధి చేకూర్చేందుకు నూతన పథకాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నారని కెసిఆర్ కు ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలని చెప్పారు. ఇలాంటి పథకాలు ఏ రాష్ట్రంలో కూడా లేవని కేవలం మన తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి అందిస్తున్నటువంటి పథకాలు పేద ప్రజలకు కుటుంబంలో ఆడపిల్లలకు పెళ్లి చేసే స్థోమత లేని వారికి కల్యాణ లక్ష్మి పథకం అందిస్తూ, ముస్లిం మైనార్టీ పేద ప్రజలకు ఆడపిల్లల కోసం షాది ముబారక్ వంటి పథకాలు ప్రవేశపెట్టి ఏ కుటుంబం కూడా బాధపడొద్దు అని అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాల అందజేయాలని తెలపడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యం మెరుగుపరచుటకై ఎన్నో పథకాలు ఆరోగ్యశ్రీలో చేర్చి పేద ప్రజలు ఇబ్బందులు పడుకుంటా మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీలో చేర్చి వైద్యం అందిస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే తెలిపారు,ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టి సీఎం కేసీఆర్ కు కృతజ్ఞతలు ఆయనకు వైరా నియోజకవర్గంలో రుణపడి ఉంటామని, తెలంగాణ రాష్ట్రం రాబోయే ఎన్నికలలో అధికారం టిఆర్ఎస్ పార్టీ దేని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చౌడం నరసింహ రావు, మండల ప్రధాన కార్యదర్శి నున్న రంగారావు,ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు నెంబర్లు, సొసైటీ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, శాఖ అధ్యక్షులు నాయకులు , అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ సీఎం ఆఫీస్ ముందే మహిళ ఆత్మహత్యాయత్నం..!



మీడియా ఫోకస్ న్యూస్ : తాను జననేతనని పదే పదే చెప్పుకొనే ఏపీ సీఎం జగన్ జనాలకు దూరమయ్యి మూడున్నర సంవత్సరాలు గడిచిపోయాయి. ఆయన ప్రజలను మరిచిపోయారనే విమర్శలు వస్తున్నాయి. అయితే జనాలు మాత్రం ఇంకా జగన్ను మరిచిపోలేదు. ఈ నేపథ్యంలోనే ''జగనన్న ఉన్నాడు. మాకు న్యాయం చేస్తాడ'ని కొందరు సీఎంవో చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇటీవల కోడికత్తి శ్రీను తల్లి కూడా ఇలానే సీఎంవోకు వచ్చి తమకుమారుడిని జైలు నుంచి విడిచిపెట్టేలా సాయం చేయాలని అభ్యర్థించే ప్రయత్నం చేశారు. కానీ సీఎం జగన్ వారికి ఛాన్స్ ఇవ్వలేదు. దీంతో ఈ వృద్ధతల్లిదండ్రులు కన్నీరు పెట్టుకుని వెనుదిరిగారు. ఇక ఇప్పుడు తాజాగా మరో మహిళ తన గోడు వెళ్లబోసుకునేందుకునేందుకు సీఎంవోకు వచ్చారు. అయితే ఆమెకు సీఎం అప్పాయింట్మెంట్ ఇవ్వలేదు. దీంతో తాడేపల్లిలోని సీఎం జగన్ కార్యాలయం వద్దే ఆ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. అచేతన స్థితిలో ఉన్న తన కుమార్తెను కాపాడాలని వేడుకునేందుకు ఆరుద్ర అనే మహిళ సీఎం కార్యాలయానికి వచ్చింది. తన గోడు వెల్లబోసుకునేటందుకు సీఎంతో మాట్లాడాలని ప్రయత్నించిన ఆమెకు ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ ఇవ్వలేదని కలత చెంది ఆత్మహత్యాయత్నకు యత్నించింది. కాకినాడ సమీపంలోని రాయుడిపాలేనికి చెందిన ఈమె.. కుమార్తె చికిత్స కోసం ఇల్లు అమ్ముకోనీకుండా ఓ మంత్రి గన్మెన్ బెదిరిస్తున్నారని సీఎం కార్యాలయ అధికారులకు ఫిర్యాదు చేసింది. సీఎంను కలిసేందుకు అనుమతించడం లేదన్న ఆమె.. ఇక న్యాయం జరగదనే ఆందోళనతో మణికట్టుపై కోసుకుని ఆత్మహత్యకు యత్నించింది. దీనిపై పోలీసులు స్పందించి స్టేషన్కు తరలించారు. మరి ఏం చేస్తారో చూడాలి. మరో కేసులో.. నిలబడలేక.. కనీసం కూర్చోలేక.. భరించలేని నొప్పితో విలవిల్లాడుతున్న తమ గారాలబిడ్డ సాయిలక్ష్మీచంద్ర బాధను జగనన్నతో చెప్పుకుందామని వ్యయప్రయాసలకోర్చి వందల మైళ దాటి వచ్చారు సాయిలక్ష్మీచంద్ర తల్లిదండ్రులు. కానీ.. జగన్ దర్శనం దొరకలేదు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద భద్రతాసిబ్బంది మనసు కరగలేదు. సీఎంను కలిసేందుకు అనుమతించలేదు. దీంతో వారు కూడా కన్నీరుమున్నీరయ్యారు. చిన్నప్పుడే వెన్నెముక సమస్యతో చక్రాలకుర్చీకి పరిమితమైంది సాయిలక్ష్మీచంద్ర. తల్లిదండ్రులు అనేక ఆస్పత్రులు తిరిగారు. ఇప్పటిదాకా మూడుసార్లు వెన్నుపూసకు శస్త్రచికిత్స చేయించారు. కోలుకోకపోవడంతో...మరోసారి ఆపరేషన్ అవసరం పడింది. ఆస్తులు పోగేసి... అప్పులు చేసి ఇప్పటికే లక్షలు ఖర్చుచేసిన ఆ కుటుంబానికి కొత్తగా అప్పు పుట్టడం లేదు. కన్నబిడ్డ ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తోంది. సీఎం సహాయ నిధి కోసం ప్రయత్నించినా ఫలించలేదు. చివరకు అన్నవరంలో ఉన్న ఇంటిని అమ్మకానికి పెట్టారు. ఇది కూడా ముందుకు సాగడం లేదు. దీంతో ఆమె బాధను జగన్కు చెప్పుకొనేందుకు వస్తే.. ఆయన దర్శనం లభించడం లేదు.

# కేరళ అనంత పద్మనాభస్వామి సంపదే కాదు.. ఊరేగింపూ ప్రత్యేకమే!



మీడియా ఫోకస్ న్యూస్ : ప్రపంచంలోనే అత్యధిక సంపద కలిగిన దేవుడిగా రికార్డులకెక్కిన దేవాలయం.. కేరళలోని అనంతపద్మనాభస్వామి గుడి. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఉన్న ఈ దేవాలయం ప్రపంచంలోనే అత్యధిక సంపద కలిగిన దేవస్థానంగా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. లక్షల కోట్ల రూపాయలు విలువ చేసే వజ్ర వైఢూర్యాలు మణి మాణిక్యాలు నగలు ఆభరణాలు కెంపులు పచ్చలు తదితరాలు అనంత పద్మనాభస్వామి సొంతం. అలాగే ఇంకా ఆ దేవస్థానం ప్రాంగణంలో ఉన్న ఆరో గదిలో ఇంతకు మించిన సంపద ఉందని అంచనాలు ఉన్నాయి. ఆ ఆరో గది తలుపు తీస్తే ప్రపంచం అంతమవుతుందని అత్యంత దారుణమైన విషాన్ని చిమ్మే సర్పాలు ఉన్నాయని మనుషుల్ని చంపి తినే మొసళ్లు ఆ గదికి కాపలా కాస్తున్నాయని సముద్రపు నీరు ముంచేస్తుందని ఇలా అనేక రకాల గాథలు ప్రచారంలో ఉన్నాయి. తద్వారా అనంత పద్మనాభస్వామి దేవాలయం దేశంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. కేవలం సంపద విషయంలోనే కాకుండా ఆయన ఊరేగింపు సైతం ప్రత్యేకమేనని తెలుస్తోంది. ఈ ఊరేగింపు 18వ శతాబ్దం నుంచి జరుగుతుండటం విశేషం. అనంత పద్మనాభస్వామి ఊరేగింపుకు బయలుదేరారంటే తిరువనంతపురంలో విమానాశ్రయంలో విమానాలను ఆపేస్తారట. ఆ ఊరేగింపు పూర్తయ్యే వరకు విమానాలన్నీ ఎక్కడివక్కడ రెక్కలు ముడుచుకుని కొన్ని గంటలపాటు ఉండిపోతాయట. ఈ ఘట్టం ప్రతి సంవత్సరం రెండుసార్లు జరుగుతుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా స్వామివారి ఊరేగింపు నవంబర్ 1న మంగళవారం జరిగింది. ఈ క్రమంలో అనంతపద్మనాభస్వామిని 'ఆరటు' పేరిట మేళ తాళాలతో స్వాగత సత్కారాలతో దేవాలయం నుంచి తిరువనంతపురం విమానాశ్రయం రన్వే పైకి గొప్ప ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ కరిక్కు(కొబ్బరి కాయ) మండపం వద్ద ఉత్సవమూర్తులను కొద్దిసేపు ఉంచారు. పూజాదికాలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి స్వామివారిని తిరిగి మేళతాళాలతో దేవాలయానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా దేవదేవుడి ఊరేగింపునకు ఎలాంటి అంతరాయం కలగకుండా తిరువనంతపురం విమానాశ్రయ రన్వేను అధికారులు నవంబర్ 1న మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకూ మూసివేశారు. ఈ క్రమంలో ఏకంగా ఐదు గంటలపాటు విమానాల టేకాఫ్ ల్యాండింగ్లను రద్దు చేశారు. దీంతో 10 విమానాల రాకపోకలు మారాయి. దీంతో ఆ విమానాల ప్రయాణాలను రీషెడ్యూల్ చేశారు.

# శిక్షణ శిభిరాన్ని సందర్శించిన న్యాక్ సి.టి.టీ..ఐ డైరెక్టర్ రాజారెడ్డి




మీడియా ఫోకస్ న్యూస్ : మఠంపల్లి మండలం వరదపురం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ సహకారంతో, భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి కార్డుకలిగిన న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) వారి సంయుక్త ఆధ్వర్యంలో, తాపీ మేస్త్రి వారికి ఉచిత శిక్షణ శిబిరాన్ని తేదీ 17-10-2022 న



ప్రారంభించడం జరిగింది . ఈరోజు సందర్శించిన న్యాక్ సి. టి. టీ. ఐ డైరెక్టర్ రాజారెడ్డి . వారు మాట్లాడుతూ, మీకు ఇచ్చిన ట్రైనింగ్ ను సద్వినియోగం చేసుకోవాలని , మీ యొక్క నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని , మానవత దృక్పథంతో, మానవ విలువలు కలిగి ఉండాలని వారు కోరారు. అనంతరం శిక్షణ తీసుకున్న తాపీ మేస్త్రి కార్మికులకు బ్యాగ్స్ అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో శిక్షకులు ఏ. సుదర్శన్ , జి .యాదగిరి వారితో పాటు యూనియన్ అధ్యక్షులు నెహ్రూ ,ప్రధాన కార్యదర్శి సిహెచ్ ప్రేమ్ సాగర్ ,ఉపాధ్యక్షులు ఎం సైదులు , ఇమ్మానుయేలు ,పల్లె. సుధాకర్, పల్లె .పుల్లయ్య, రమేష్ రాజు ,యేసు, దేవయ్య, మహమ్మద్, జానీ పాషా ,రామకృష్ణ ,సుమన్ , వెంకటేశ్వర్లు, ప్రసాద్, సిహెచ్ శ్రీను, సతీష్ ,తదితరులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ ఉద్యమ స్ఫూర్తితో డివైఎఫ్ఐ పోరాటం



మీడియా ఫోకస్ న్యూస్ : దేశ స్వాతంత్రం కోసం పోరాడిన ప్రాణాలర్పించిన వీరుల స్ఫూర్తితో డివైఎఫ్ఐ అందరికీ విద్యా ఉపాధి కోసం ఉద్యమాలు నిర్వహిస్తుందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాసాని కిషోర్ కార్యదర్శి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో డివైఎఫ్ఐ 42వ, ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా డివైఎఫ్ఐ జెండాను లిజిల్లా అధ్యక్షులు కాసాని కిషోర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాసాని కిషోర్ మాట్లాడుతూ.. త్యాగం పోరాటం పురోగతి ఆశయంతో 1980 లో పంజాబ్ రాష్ట్రంలోని లుతియాన లో ఏర్పడ్డ డివైఎఫ్ఐ 42 సంవత్సరాల నుంచి యువతలో చైతన్యము నింపడమే లక్ష్యంగా పనిచేస్తుందని, సమాజంలో ఉన్న సమానతలు తొలగించడం కోసం, ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ స్పందించడానికి సిద్ధంగా ఉండు అనే చేగువేరా నినాదంతో, దేశంలో యువత సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తుంది, అవినీతి అంతం డివైఎఫ్ఐ పంతం నినాదంతో అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. కులం అంటే కుళ్ళు మతం అంటే మత్తు సమతే మన సరిహద్దు అంటూ ప్రజలను ఐక్యం చేస్తుంది. విచ్ఛిన్న వేర్పాటువాదాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి అనేకమంది డివైఎఫ్ఐ కార్యకర్తలు దేశం కోసం ప్రాణాలర్పించారు. నేటి పాలకులు అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలపై ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో డివైఎఫ్ఐ చేస్తున్న పోరాటాల్లో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి జహంగీర్ నాయకులు సూర్య, శ్రీరామ్, సంజయ్, నరేష్, శేఖర్, నసీమా త్రివేణి, భవాని ,శైలజ ,మాధవి ,జ్యోతి ,స్వప్న తదిరులు పాల్గొన్నారు.

# గురువయ్యకు నివాళులర్పించిన టీఎస్ జేఏ నాయకులు




మీడియా ఫోకస్ న్యూస్ : ప్రముఖ తెలుగు దినపత్రిక మరో కిరణాలు మునగాల మండలం రిపోర్ట్ తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ పి నాగబాబు తండ్రి గురవయ్య పెద్ద కర్మ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్బంగా గురవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జర్నలిస్టు నాగబాబును ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి యాదగిరి,రాష్ట్ర ప్రచార సహాయ కార్యదర్శి దుర్గం బాలు,సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టి గుండ్ల రాము,కోశాధికారి నాయిని రమేష్,సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడు రామచంద్రరాజు,పట్టణ అధ్యక్షుడు చిలుకల చిరంజీవి,మోదీ మండల ప్రధాన కార్యదర్శి కొండా ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

# పాత్రికేయులను ప్రభుత్వం ఆదుకోవాలి.



మీడియా ఫోకస్ న్యూస్ : తమిళనాడు తరహాలోనే తెలంగాణ రాష్ట్రంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం పాత్రికేయుల కు పింఛన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్ దిల్ సుక్ నగర్ లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అక్కడ రాష్ట్రంలో జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించడంతోపాటు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు తీసుకున్న నిర్ణయం గొప్ప విషయం అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తో పాటు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో హామీ ఇచ్చిన ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు చిన్న పత్రికల యాజమాన్యాలకు ప్రకటనలు ఇచ్చి చేయూతనివ్వాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న దళిత జర్నలిస్టులందరికీ దళిత బంధు పథకం లో ప్రత్యేక కోటా కేటాయించి దళిత బందు ను అందించాలన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నివారించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటేపాగా హుస్సేన్ , రాష్ట్ర ప్రధానకార్యదర్శి తక్కల్ల పల్లి రాజేందర్ , రాష్ట్ర కార్యదర్శి అంకగల్ల కరుణాకర్ , రాష్ట్ర నాయకులు సోమన్న , ఉపేందర్ ,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# సకల దేవతల స్వరూపిణి గోమాత



మీడియా ఫోకస్ న్యూస్ : సకల దేవతలు కొలువైన గోమాతను పూజిస్తే అష్ట ఐశ్వర్యములు కలుగుతాయని ఆధ్యాత్మిక తత్వ వేత్త చాగంటి కోటేశ్వరావు అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ లో చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీమతి ఆకుండి లక్ష్మీ గోశాలను సూర్యాపేట శ్రీ సంతోషి మాత దేవాలయం కమిటీ బృందం వారితో కలిసి సందర్శించి అక్కడి నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రాంతములో నైతే గోవులు పూజించబడుతాయో ఆ ప్రాంతం కరువు కాటకాలు లేకుండా సస్యశ్యామలం గా ఉంటాయని తెలిపారు. శ్రీ సంతోషిమాత దేవాలయం ప్రధాన కార్యదర్శి బ్రాహండ్ల మురళీధర్ తెలుపుతూ శ్రీ సంతోషి రూప దేవి సేవా సమితి ఆధ్వర్యంలో ఆత్మకూర్ ఎస్ మండలం పాత సూర్యాపేట స్టేజి వద్ద గల శ్రీ సంతోషిమాత ఉద్యానవన క్షేత్రంలో నిర్మించబడ్డ గోశాల ను ఆధునీకరించుటకు అక్కడి గోశాలను సందర్శించడం జరిగినదని తెలిపారు ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు ను శ్రీ సంతోషిమాత దేవాలయం తో పాటు శ్రీ సంతోషిమాత ఉద్యానవన క్షేత్రాన్ని సందర్శించవలసిందిగా కోరడం జరిగిందని తెలిపారు. గోశాల సంరక్షణ, పునర్నిర్మాణంలో కొన్ని సూచనలు సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. సందర్శించిన వారిలో దేవస్థానం అధ్యక్షులు నూక వెంకటేశం గుప్త, కమిటీ సభ్యులు సోమ శ్రీశైలం, గోపారపు రాజు బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

# ఫైటర్ సమంతకి ఇదో పెద్ద లెక్కా..?



స్టార్ స్టేటస్ రావడం కోసం ఒక్కొక్కరు ఒక్కోలా కష్టపడతారు. అయితే వచ్చిన ఆ స్టార్ ఇమేజ్ ని కాపాడుకునేందుకు మాత్రం చాలా తక్కువ మంది పోరాడుతారు. అలాంటి వారిలో సౌత్ స్టార్ హీరోయిన్ సమంత ఒకరు. ఏ మాయ చేసావె సినిమా నుంచి తెలుగు ఆడియన్స్ ని మాయ చేస్తూనే వస్తుంది సమంత. మధ్యలో అక్కినేని ఇంటి కోడలిగా వెళ్లి ఆ తర్వాత డైవర్స్ తీసుకోవడం ఇదంతా ఆమె కెరియర్ కు చాలా ప్రమాదకరంగా మారినా తన ప్రతిభతో మళ్లీ అవకాశాలు అందుకుంటుంది సమంత.అయితే పోరాడే వాడికే ఎక్కువ బాధలు అన్నట్టుగా కెరియర్ లో మళ్లీ మునుపటి ఫాంలోకి రావాలని ప్రయత్నిస్తున్న సమంతకి మరో బిగ్ షాక్ తగిలింది. అదే తనకు వచ్చిన మయోసైటిస్ వ్యాధి. రెగ్యులర్ గా వర్క్ అవుట్స్ చేస్తూ ఉండే సమంతకి ఇలాంటి వ్యాధి రావడం అందరిని షాక్ అయ్యేలా చేసింది. రియల్ లైఫ్ లో ఇన్ని ఇబ్బందులు పడుతున్న సమంత రీల్ లైఫ్ లో రిస్క్ ఎందుకు చేయదు చెప్పండి. ప్రస్తుతం సమంత నటించిన యశోద సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ నెల 11న రిలీజ్ కాబోతున్న ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా సినిమా లో సమంత చేసిన యాక్షన్ సీన్స్ మేకింగ్ వీడియో రిలీజ్ చేశారు. సమంత ఈ యాక్షన్ సీక్వెన్స్ కోసం చాలా కష్టపడ్డది. సమంత ది ఫైటర్ అని ఊరకనే అనడం కాదు ఆమె స్క్రీన్ అవతల పడుతున్న కష్టాన్ని చూస్తే ఎవరైనా ఒప్పుకోక తప్పదు. ఆన్ స్క్రీన్ అయినా ఆఫ్ స్క్రీన్ అయినా ఎన్ని కష్టాలు వచ్చినా తను మాత్రం తగ్గేదేలే అన్నట్టు దూసుకెళ్తుంది సమంత. ప్రస్తుతం సమంత యశోద నుంచి యాక్షన్ సీన్స్ వీడియో వైరల్ గా మారింది. ఈ సినిమాలో ఈ యాక్షన్ సీన్స్ ని హాలీవుడ్ స్టంట్ మాస్టర్ యానిక్ బెన్ కంపోజ్ చేశారు.యశోద యాక్షన్ మేకింగ్ వీడియో చూసిన ఆడియన్స్ సమంత డెడికేషన్స్ కి ఫిదా అవుతున్నారు. అయినా ఫైటర్ సమంత రియల్ లైఫ్ లోనే ఎన్నో రిస్క్ లని ఫేస్ చేస్తుంది. రీల్ లైఫ్ అది కూడా ఆడియన్స్ ని మెప్పించడం కోసం ఈ మాత్రం కష్టపడం ఆమెకి ఒక లెక్కా అని సమంత ఫ్యాన్స్ అంటున్నారు. యశోద మూవీని హరి-హరీష్ దర్శక ద్వయం డైరెక్ట్ చేశారు. ఈ థ్రిల్లర్ మూవీని శ్రీదేవి మూవీస్ బ్యానర్ లో శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మించారు.

# ఆమె ఎంట్రీకై ఎదురుచూస్తున్న బాలీవుడ్..!





బాలీవుడ్ లో మరో స్టార్ తనయ తెరంగేట్రానికి రంగం సిద్ధమైంది. బాలీవుడ్ క్రేజీ జోడీ అజయ్ దేవగన్ కాజోల్ ల గారాల పట్టి నైసా దేవగన్ తెరంగేట్రానికి రెడీ అంటుంది. అమెరికాలో స్టడీ పూర్తి చేసిన ఈ అమ్మడు వెండితెరకు పరిచయమయ్యేందుకు ఆసక్తిగా ఉంది. ఇప్పటికే బాలీవుడ్ ఈవెంట్స్ ఎక్కడ జరిగినా సరే తన ప్రెజెన్స్ తో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న నైసా సినిమాల్లోకి రాకముందే తన గ్లామర్ తో ఆడియన్స్ దృష్టిని ఆకర్షిస్తుంది. సినిమాల్లోకి ఎంట్రీ ఇవ్వకముందే సినీ కల్చర్ అలవర్చుకుంటున్న అమ్మడు త్వరలోనే తన తొలి సినిమా ఎనౌన్స్ చేయబోతుందని తెలుస్తుంది.ఇప్పటికే కాజోల్ కూతురు కోసం కథలను వింటుందట. హీరో అయినా హీరోయిన్స్ అయినా కెరియర్ లో తొలి సినిమా చాలా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. అదికూడా బ్యాక్ గ్రౌండ్ ఉండి.. స్టార్స్ ఫ్యామిలీ నుంచి వస్తున్న హీరోయిన్స్ మీద ఇంకాస్త ఎక్కువ ఫోకస్ ఉంటుంది.అందుకే నైసా కోసం కథ వేట కొనసాగిస్తున్నారట. ఓ పక్క అజయ్ దేవగన్ హీరోగా సినిమాలు చేస్తూనే ఉన్నారు. కాజోల్ మాత్రం కూతురు కోసం అద్భుతమైన కథ కావాలని అంటుందట. ఇప్పటికే కాజోల్ నైసా కోసం పదుల సంఖ్యల్లో కథలు విన్నట్టు తెలుస్తుంది. వాటిలో ది బెస్ట్ అనిపించుకున్న కథలను సెలెక్ట్ చేసే పనిలో ఉందట. తనయురాలి సినిమా కోసం కాజోల్ తాపత్రయం చూసి అందరు షాక్ అవుతున్నారట..బాలీవుడ్ లో ఇప్పటికే స్టార్ తనయులు చాలామంది ఎంట్రీ ఇచ్చి అదరగొడుతున్నారు. ఇప్పుడు నైసా కూడా అదే దారిలో తన సత్తా చాటాలని చూస్తుంది. జాన్వి అనన్యా పాండే సారా అలి ఖాన్ తరహాలో నైసా కూడా బాలీవుడ్ సినిమాల్లో రాణించాలని చూస్తుంది. ఇప్పటికే బాలీవుడ్ ఈవెంట్స్ లో తన గ్లామర్ అప్పీల్ తో వార్తల్లో నిలుస్తున్న నైసా సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇచ్చాక మరింత రెచ్చిపోతుందని చెప్పొచ్చు.స్టార్ తనయగా తన మీద ప్రెజర్ ఉన్నా సరే తన టాలెంట్ తో అందరిని మెప్పించేందుకు రెడీ అంటుంది నైసా. రీసెంట్ గా దివాళి బాష్ లో కూడా నైసా తన లుక్స్ తో ముంబై మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇవ్వకముందే ఈ రేంజ్ క్రేజ్ తెచ్చుకున్న నైసా ఎంట్రీ ఇచ్చాక మరింత ఫాలోయింగ్ తెచ్చుకునే ఛాన్స్ ఉంది.





# ఆదిపురుష్ : టీజర్ పై ట్రోల్స్ తో కీలక మార్పులు?



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రూపొందిన భారీ మోషన్ గ్రాఫిక్స్ మూవీ ఆదిపురుష్ సంక్రాంతి కానుకగా విడుదల కాబోతున్నట్లుగా మొన్నటి వరకు చిత్ర యూనిట్ సభ్యులు బలంగా వాదించిన విషయం తెల్సిందే. దసరా సందర్భంగా టీజర్ విడుదల చేసిన సమయంలో కూడా విడుదల తేదీని సంక్రాంతికే అంటూ బలంగా చెబుతూ వచ్చారు. తాజాగా సినిమా ను సంక్రాంతికి విడుదల చేయలేక పోతున్నాం అంటూ బయ్యర్లకు ఆదిపురుష్ చిత్ర నిర్మాతలు తెలియజేయడంతో అధికారికంగా సినిమా విడుదల వాయిదా పడ్డట్లు అయ్యింది. సంక్రాంతి బరి నుండి తప్పుకున్న ఆదిపురుష్ వచ్చే ఏడాది సమ్మర్ లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సమయంలో సినిమా గురించి ఆసక్తికర పుకారు షికారు చేస్తోంది.ఆదిపురుష్ టీజర్ విడుదల అయిన తర్వాత విపరీతమైన ట్రోల్స్ వచ్చిన విషయం తెల్సిందే. చిన్న పిల్లల కార్టూన్ చూసినట్లుగా ఉందంటూ చాలా మంది టీజర్ లోని కొన్ని విజువల్స్ ను విమర్శించారు. దాంతో ఇప్పుడు ఆదిపురుష్ లో మార్పులు మొదలు అయ్యాయి అంటూ సమాచారం అందుతోంది.ఇప్పటికే గ్రాఫిక్స్ వర్క్ పూర్తి చేసిన కూడా మళ్లీ చాలా సన్నివేశాలకు గ్రాఫిక్స్ వర్క్ ను చేయబోతున్నట్లుగా సమాచారం అందుతోంది.ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వంద కోట్ల రూపాయలను అదనంగా పెట్టి కొత్తగా వీఎఫ్ఎక్స్ షాట్స్ ను కొత్తగా డిజైన్ చేయిస్తున్నారు అంటూ వార్తలు వస్తున్నాయి.వంద కోట్ల గ్రాఫిక్స్ ను మళ్లీ చేయాలి అంటే రెండు మూడు నెలల్లో అయ్యేది కాదు. కనుక ఆదిపురుష్ విడుదల వచ్చే ఏడాది సమ్మర్ లో కూడా ఉండటం అనుమానమే అన్నట్లుగా కొందరు మీడియా సర్కిల్స్ వారు గుసగుసలాడుకుంటున్నారు. ఆదిపురుష్ కొత్త విడుదల తేదీ వచ్చేప్పటి వరకు ఏదో ఒక పుకారు పుడుతూనే ఉంటుంది. అదనంగా వంద కోట్లు ఖర్చు చేస్తే సరే కానీ ఈసారి అయినా మంచి ఔట్ పుట్ ఇస్తారా అంటూ కొందరు నెటిజన్స్ ప్రశ్నిస్తున్నారు.




# వామ్మో చిట్టి ఆశ చాలా పెద్దదే..!



టాలీవుడ్ లో ఇప్పుడు చిట్టి సందడి కనిపిస్తుంది. కేవలం ఒకే ఒక్క సినిమాతో అమ్మడు టాప్ లీగ్ లోకి వచ్చేసింది. జాతిరత్నాలు సినిమాతో సూపర్ హిట్ అందుకున్న ఫరియా అబ్దుల్లా ఆ సినిమాలో నటించడంతో లక్కీ హీరోయిన్ అయ్యింది. కెరియర్ లో ఆచి తూచి అడుగులేస్తున్న అమ్మడు జాతిరత్నాలు ఎంత పెద్ద హిట్టైనా వచ్చిన ప్రతి ఆఫర్ ను ఓకే చేయకుండా తనకు నచ్చిన సినిమాలను మాత్రమే చేస్తా అంటుంది. లేటెస్ట్ గా సంతోశ్ శోభన్ హీరోగా వస్తున్న లైక్ షేర్ సబ్ స్క్రైబ్ సినిమాలో నటించింది అమ్మడు. ఈ సినిమాలో ఓ యూట్యూబర్ గా ఫరియా కనిపించనుంది.నవంబర్ 4న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ప్రమోషన్స్ కోసం హీరో హీరోయిన్ ఓ రేంజ్ లో పాల్గొంటున్నారు. ఈమధ్య ఎక్కడ చూసినా సరే లైక్ షేర్ సబ్ స్క్రైబ్ సినిమా సందడిలో భాగంగా ఎక్కడ చూసినా సరే వీరిద్దరే కనిపిస్తున్నారు. ఇక తాజాగా సినిమా ప్రమోషన్స్ లో భాగంగానే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు.అక్కడ వారి కెరియర్ ఎలా మొదలైంది అన్న విషయాలను వివరించారు. ఫరియా అబ్దుల్లాని తన కాలేజ్ లో చూసి నాగ్ అశ్విన్ తనని హీరోయిన్ గా చేస్తావా అని అడిగారట.. ఆ తర్వాత నేనే ఆయన్ను ఫాలో అప్ చేసి ఆడిషన్స్ చేసి జాతిరత్నాలు ఛాన్స్ అందుకున్నా అని చెప్పారు ఫరియా అబ్దుల్లా. ఫాదర్ ఆటోమొబైల్ బిజినెస్ చేస్తారని.. ఫ్యామిలీ దుబాయ్ లో ఉంటారని. తను స్టడీస్ కోసం ఇక్కడ ఉంటున్నానని అన్నారు ఫరియా. ఎలగైనా సరె రాజమౌళి సినిమాలో నటించాలని అంటున్నారు ఫరియా అబ్దుల్లా. అలాంటి గోల్డెన్ ఛాన్స్ రావాలని కోరుతున్నా అని అన్నారు. ఇక తనంటే తనకు చాలా ఇష్టమని. ఎక్కడకి వెళ్లినా తను ఒక్కదాన్నే వెళ్తానని అంటున్నారు ఫరియా.టాలీవుడ్ లో మంచి హైట్ ఫిజిక్ ఉన్న హీరోయిన్ గా ఫరియా అదరగొట్టబోతుంది. జాతిరత్నాలు హిట్ కొట్టగా లైక్ షేర్ సబ్ స్క్రైబ్ కూడా హిట్ టాక్ తెచ్చుకుంటే ఆమె కోరినట్టు రాజమౌళి ఖచ్చితంగా ఛాన్స్ ఇస్తాడని చెప్పొచ్చు. ఇక కెరియర్ లో చాలా ప్రయోగాలు చేయాలని అనుకుంటున్నానని చెప్పిన ఫరియా డైరక్షన్ వైపు కూడా ఆసక్తి ఉందని చెప్పి షాక్ ఇచ్చింది. అంతేకాదు పాతికేళ్లు ఇండస్ట్రీలో ఉంటానని చెబుతున్న అమ్మడి గట్స్ కి హ్యాట్సాఫ్ చెప్పేస్తున్నారు ఆడియన్స్.













Printed, Published and Owned by DOMALAPALLY NAGARAJU,1-93, Munganoor vill, Abdullapurmet mdl,Hayathnagar,R.R.Dist-TS.Printed at MANIRAGHAVA PRINTERS,#A-20,Vambe Colony ,Hyderguda,Rajendra Nagar, Ranga Reddy Dist, Telanga-500035.Editor: DOMALAPALLY NAGARAJUCell: 9948556668,,Email:mediafocus15@gmail.comWeb: mediafocusnews.com